క్లుప్తంగా

తెలుగు భాషకు గాదంశెట్టి సేవలు అమూల్యం



గాదంశెట్టిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

నాగులుప్పలపాడు: తెలుగు భాషకు గాదంశెట్టి శ్రీనివాసులు చేస్తున్న సేవలు మరువలేనివని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇటీవల గిడుగు పురస్కారం అందుకున్న సందర్భంగా మంగళవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో శ్రీనివాసులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పొన్నూరి మాట్లాడుతూ అటు ఉపాధ్యాయ వృత్తిలోనూ ఇటు సాహిత్య రంగాల్లో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం గాదంశెట్టిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

చీమకుర్తి క్రీడాకారుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్, హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చీమకుర్తి: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, హాకీ పోటీలకు చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలుకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో శివ, శశికుమార్, సాగరిక, హాకీలో అమిత్ ఎంపికైన వారిలో ఉన్నారు. అండర్–14 సాఫ్ట్‌బాల్‌లో మనోహర్, భద్రాద్రి ఎంపికయ్యారు. మంగమూరు జిల్లా పరిషత్ హైస్కూలులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటారని తెలిపారు. ఎంపికైన వారిని హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బి.జవహర్, పీడీలు, పీఈటీలు అభినందించారు.

జాషువా జయంతి జయప్రదం చేయండి

దర్శి: గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలు జయప్రదం చేయాలని ఎంపీపీ సుధారాణి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం కర పత్రాలను ఆవిష్కరించారు. కవులు, కళాకారులకు పౌర సన్మానం ఉంటుందని చెప్పారు. జీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరం వెంకటేశ్వర్లు, ప్రకృతి వైద్య నిపుణులు వైవీ రెడ్డి, దళిత సేన నాయకులు కంద్లగుంట మార్కు, ప్రేమ్ కుమార్, ప్రసాద్, మోషె, ఏసుదాసు, కోటేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవలో భాగస్వాములు కావాలి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



పూడికతీస్తున్న పోతురాజు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

- పోతురాజు కాలువ పరిసరాల్లో పారిశుద్ధ్యం పాటించాలి
- నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: పోతురాజు కాలువ పరిసరాల్లో పారిశుద్ధ్యం పాటించాలని పరిసర ప్రాంత ప్రజలకు ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వర రావు సూచించారు. మంగళవారం నగరంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మపాలెంతో పాటు పోతురాజు కాలువ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛత హీ సేవా ప్రజలను భాగస్వాములను చేశారు. కార్యక్రమానికి సంబంధించిన పాంప్లేట్లు పంచిపెట్టారు. బ్యానర్లను ప్రదర్శించి స్వచ్ఛత హీ సేవా అవగాహన కల్పించారు. పోతురాజు కాలువ వెంబడి పరిసర ప్రాంత వాసులతో ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోతురాజు కాలువ పరిసరాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఎలా పడితే అలా కాలువలో వ్యర్థాలను పడేయరాదన్నారు. ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ ఆటోలకు తడి, పొడి, హానికార చెత్తలను అందించాలని సూచించారు. రోడ్ల మీద కూడా చెత్తను విచ్చలవిడిగా పడేస్తున్నారని కూడా గుర్తు చేశారు. లేకుంటే పరిసరాల్లో ఉండే డస్ట్ బిన్‌లలో అయినా పడేయాలే తప్ప విచ్చలవిడిగా చెత్తను పడేస్తే చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించారు. అనంతరం నగరంలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న మురుగు కాలువల శుభ్రం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నూరు శాతం వసూలు చేయాలి

ఒంగోలు సబర్బన్: ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి అర్ధ సంవత్సరానికి సంబంధించిన పన్నులు వసూలు వేగవంతం చేయాలని ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన తన చాంబర్‌లో మంగళవారం నగర పాలక సంస్థకు సంబంధించిన రెవెన్యూ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు వసూలులో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. ఇప్పటి వరకు కేవలం 40 శాతం మాత్రమే వసూలు చేశారని, మిగతా 10 శాతం ఎన్ని రోజుల్లో వసూలు చేయగలరని ప్రశ్నించారు. మొదటి అర్ధ సంవత్సరం పూర్తి కావటానికి మరో నాలుగు రోజులు మాత్రమే ఉందని గుర్తు చేశారు. ఈ నెల 30వ తేదీ లోపు పన్నులు 100 శాతం వసూలు చేయాలని ఆదేశించారు. ప్రతి రోజూ కార్యాచరణ కేటాయించుకొని వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సాయంతో పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా నగరంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లు, కూరగాయల మార్కెట్‌లో గల షాపుల అద్దె బాకీల వసూలు, షాపుల రెన్యువల్స్ గురించి కూడా అధికారులతో సమీక్షించారు. అద్దె బకాయిల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, సిబ్బందిపై షో కాజు నోటీసులు జారీ చేయాలని అసిస్టెంట్ కమిషనర్ ఆంజనేయులును ఆదేశించారు. నగరంలోని 300 మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లోని షాపుల అద్దెలు వసూలు చేయాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం పన్నులు, షాపుల అద్దె వసూళ్ళపై సమీక్ష నిర్వహిస్తానని, సరైన సమయంలో స్పందించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తప్పవని కూడా హెచ్చరించారు. సమీక్షలో అసిస్టెంట్ కమిషనర్ ఆంజనేయులుతో పాటు రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్



పూజలు చేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ముండ్లమూరు: వినాయక విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని తమ్మలూరు, వేముల బండ, పసుపుగల్లు గ్రామాల్లో ఉత్సాహంగా స్టెప్పులు వేశారు. పసుపుగల్లులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు చింతా శ్రీనివాసరెడ్డి, సూదిదేవర అంజయ్య, బిజ్జం కృష్ణారెడ్డి, బంకా నాగిరెడ్డి, మేడగం వెంకటరమణారెడ్డి, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు పండించేందుకు కృషి



మాట్లాడుతున్న ఆర్‌ఎం లక్ష్మణరావు, బోర్డు అధికారులు

మద్దిపాడు: పొగాకు పండించే రైతులు విస్తీర్ణం పెంచకుండా బోర్డు అనుమతించిన పరిమితిలోనే నాణ్యమైన పొగాకును పండిస్తే మంచి ధరలు లభిస్తాయని పొగకు బోర్డు ఆర్‌ఎం ఎం. లక్ష్మణ రావు అన్నారు. మంగళవారం తెల్లబాడులో వెల్లంపల్లి పొగాకు బోర్డు అధికారి శ్రీనివాస్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సంవత్సరం అతర్జాతీయంగా పొగాకు పంట దిగుబడి లేని కారణంగా మన దగ్గర ఉన్న పొగాకుకు మార్కెట్‌లో అధికధర లభించిందని కానీ.. వచ్చే సీజన్‌కు మార్కెట్ పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేమని అందువలన రైతులు పొగాకు బోర్డు ఇచ్చిన పరిమితులకు మించి పండించకుండా ఉంటే మంచి ధర లభించే అవకాశాలున్నాయన్నారు. మంచి ధర లభిస్తున్న నేపథ్యంలో పొగాకు రైతులు నాణ్యత గలిగిన పొగాకును పండించేందుకు కృషి చేయాలన్నారు. అదే క్రమంలో ఉత్పాదకతను కూడా పెంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఎస్ తులసి, సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్, ఐటీసీ, జీపీఐ, పీఎస్ఎస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శోభాయమానంగా శ్రీగిరి గిరి ప్రదక్షిణ



కొండమీదకి గిరి ప్రదక్షిణగా బయలుదేరిన భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక కొండమీద శ్రీగిరి వీధులన్నీ గోవింద నామస్మరణతో మార్మోగాయి. మంగళవారం వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి శ్రీగిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీవారి నక్షత్రం శ్రవణ నక్షత్రం రోజు వందలాదిగా భక్తులు తరలివచ్చి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ భక్తులు గోవిందనామాలు పలుకుతుండగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 5 గంటలకు జయరాం హాలు వద్ద గల శ్రీబాపూజీ గోసంరక్షణ సంఘం, గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం భక్తులు గ్రంథాలయం, కేశవ స్వామిపేట దేవాలయంల మీదుగా శర్మ కాలేజీ రోడ్డు, క్రికెట్ గ్రౌండ్ గద్దల గుంట బస్టాండ్ మీదుగా గోసంఘం వద్ద నుంచి శ్రీగిరి చేరి శ్రీస్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి నిస్మరిస్తూ ప్రార్థిస్తూ, కీరిస్తూ భజనపాటలు, గోవిందనామాలు పలుకుచూ స్వామిని వట్టి కాళ్లతో శ్రీగిరి చేరి స్వామిని దర్శించుకుని ఆధ్యాత్మిక చింతనతో అలౌకిక ఆనందాన్ని పొందారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రవణా నక్షత్రం రోజున జరుగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించిన స్వామి వారి మరో భక్త బృందం పౌర్ణమి రోజున సాయంత్రం 6 గంటలకు శ్రీవారిని దర్శించుకోవాటానికి గిరి ప్రదక్షిణ మొదలుపెట్టారన్నారు.

నేడు శింగరాయకొండలో కలెక్టర్ స్పందన

ఒంగోలు అర్బన్: ప్రతి బుధ, శుక్రవారాల్లో మండలంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో భాగంగా ఈ బుధవారం శింగరాయకొండ మండలంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. శింగరాయకొండలోని గంజివారి కళ్యాణ మండపంలో స్పందన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారంలో రాచర్ల మండలంలో కలెక్టర్ స్పందన జరుగుతుందని తెలిపారు.

శ్రీవారి ఆలయంలో శ్రవణా నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామి వార్లకు అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకలు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారిని వెండి కిరీటాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మంగళవారం మోడరన్ ఐ హాస్పిటల్ ఒంగోలు వారిచే కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 1020 మందిలో 120 మందికి దృష్టి లోపం గుర్తించారు. ఒంగోలులో కంప్యూటర్ ద్వారా మెరుగైన పరీక్షలు నిర్వహించి వైద్య సహాయం అందిస్తామని చెప్పారు. డాక్టర్ ఎంవీ రమణారెడ్డి మాట్లాడుతూ సి విటమిన్‌తో కూడిన ఆకుకూరలు ఆహారం తీసుకోవాలని సూచించారు. డాక్టర్ అర్పణా షాఫర్, టెక్నీషియన్లు ఎం.నాగరాజు, వై.ప్రసాద్, ఎ.కిరణ్‌కుమార్, పీఆర్వో సురేంద్ర, హెచ్‌ఎం పాలేటి సుబ్బారావు, నేతాజీ స్కౌట్ లీడర్ వి.శేషారావు, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన సద్వినియోగం చేసుకోండి



పథకాలను వివరిస్తున్న బీజేపీ నేతలు

ఒంగోలు సెంట్రల్: పట్టణంలోని బలరాం కాలనీని బీజేపీ నాయకులు మంగళవారం సందర్శించారు. పార్టీ అధ్యక్షుడు శివా రెడ్డి నూతనంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విశ్వకర్మ యోజనతో దళిత వాడలో నివసిస్తున్న చేతి వృత్తుల చేసుకునే వారి కోసం ప్రవేశ పెట్టిన పథకాల గురించి వివరించారు. సెగ్గం శ్రీనివాసరావు, జె. క్రిష్ణవేణి, నాగేశ్వరరావు, శివాజీ యాదవ్, దామోదర్, అనిల్, కీర్తి పాల్గొన్నారు.

నిత్య అన్నదాన ట్రస్ట్‌కు భగీరథ చేయూత



చేయూత అందిస్తున్న భగీరథ ఫ్యాక్టరీ సిబ్బంది

ఒంగోలు సెంట్రల్: హరి హర అయ్యప్ప నిత్య అన్నదాన ట్రస్ట్‌కు భగీరథ ఫ్యాక్టరీ చేయూత అందించింది. 50 బస్తాల బియ్యం, 250 కేజీల కంది పప్పు మెనేజింగ్ డైరెక్టర్ సింగవరపు చంద్రశేఖర్ సూచన మేరకు అందించినట్లు మేనేజర్ కాకని హరిబాబు తెలిపారు. మాల ధారణ చేసే స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగాలని అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, లింగమనేని వెంకటరామయ్యలు ఆకాంక్షించారు. యరజర్ల సర్పంచ్ తమ్మిశెట్టి శ్రీనివాసులు, ట్రస్ట్ చైర్మన్ చల్లాఅంకరావు, వెంకటరావు గురుస్వామిలకు బియ్యం, కందిపప్పు అందజేశారు.

సత్తా చాటిన జెడ్పీ విద్యార్థులు

దొనకొండ: ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్, సాఫ్ట్ బాల్ పోటీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయిఅ క్రీడా పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నరసింహారావు తెలిపారు. హ్యాండ్ బాల్ పోటీల్లో పెద్దపోగు ఏసోబు, అన్నం గురుక్రిష్ణ, సాఫ్ట్ బాల్ పోటీల్లో వెంకటేశ్వర్లు, అన్నం గురుక్రిష్ణ, రేపూడి స్నేహ, సుమిత్ర, చంద్రశేఖర్, నీలంపాటి రాజు, తమ్మిశెట్టి అరవింద్ ఎంపికయ్యారు. హెచ్‌ఎం వి.వి రామాంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు. రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి నైపుణ్యం సాధించండి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఒంగోలు సెంట్రల్: సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, నూతనం ఆలోచించి ప్రజలకు సరైన, సులభమైన పరిష్కరించేందుకు విద్యార్థులు ముందడుగు వేయాలని వక్తలు అన్నారు. స్థానిక పేస్ కళాశాలలో మంగళవారం స్మార్ట్ ఇండియా హ్యాక్ థాన్ (ఇంటర్నల్ హ్యాక్ థాన్) కార్యక్రమాన్ని కోఆర్డినేటర్ అండ్ ఇన్నోవేషన్ అంబాసిడార్ ఎం. జానకీ రాం ఆధ్వర్యంలో నిర్వహించారు. జ్యూరీ కమిటీ మెంబర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి మాట్లాడుతూ భారత దేశంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాక్ థాన్ కార్యక్రమంలో పేస్ వినూత్నమైన ఆవిష్కరణలు చేసేందు నాంది పలుకుతున్నట్లు చెప్పారు. డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ అప్పారావు పలు సూచనలు చేశారు.

ఆదాయ వనరుల కోసం ఖర్చు చేయండి



ఏటీఎం మిషన్‌లను అందిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రవికుమార్

చీమకుర్తి: మహిళా సమాఖ్య సభ్యులు ప్రాజెక్ట్ నుంచి తీసుకున్న స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాలను ఆదాయ వనరుల పెంపుపై ఖర్చు చేయాలని డీఆర్‌డీఏ పీడీ కె. రవికుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన చీమకుర్తిలోని వైఎస్సార్ కేపీ భవనంలో మండలంలోని మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశమయ్యారు. ఏటీఎం మిషన్‌లను సభ్యులకు అందించారు. ఏపీఎం ఎల్.కోటేశ్వరరావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రావణి, వైఎస్సార్ కేపీ సిబ్బంది పద్మావతి, పద్మ, బ్రహ్మయ్య, శ్రీను, అజయ్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

- 18 వాహనాలకు రూ.35 వేల జరిమానా



పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

పొదిలి: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ జె.సుందరరావు, దర్శి ఎంవీఐ రవి కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వాహనాలను తనిఖీ చేసి 18 మందికి రూ.35 వేలు జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం, సరైన పత్రాలు లేనివారికి జరిమానా తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో డిపో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎస్‌డీఎం వలి, బీఎస్ వాసు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌లో మార్కాపురం విద్యార్థినికి అవార్డు



జ్యూరీ అవార్డు అందుకుంటున్న చంద్రిక

మార్కాపురం టౌన్: మార్కాపురం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని వైవిటి చంద్రిక విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌లో ఆరో స్థానంలో నిలిచి ప్రత్యేక జ్యూరీ అవార్డు అందుకున్నట్లు హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. మిల్లెట్స్ ఏ సూపర్ ఫుడ్ అనే అంశంపై చంద్రిక ప్రదర్శనకు జ్యూరీ అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి. ప్రతాప్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు చెప్పారు. శనివారం ఒంగోలులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో చంద్రిక ప్రథమ స్థానం సాధించడంపై పండిత పరిషత్ రాష్ట్ర కార్యదర్శి రవిచంద్ర అభినందించారు.

పగటి పూట కరెంట్ ఇవ్వండి



విద్యుత్ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ

చీమకుర్తి: రైతులకు పగటి పూట నిరంతరం 9 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎల్రక్టికల్ ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ తెలిపారు. చీమకుర్తి విద్యుత్ సబ్‌డివిజన్ స్థాయిలో మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జగనన్న కాలనీల్లో గృహ వినియోగదారులకు విద్యుత్ సర్వీస్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఎస్ఈ సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. దర్శి డివిజన్ ఈఈ ఎస్ఏ కరీం, చీమకుర్తి డీఈ డీ.వెంకట కృష్ణారెడ్డి, ఏఈ వి. శ్రీనివాసరావు, అకౌంట్స్ ఆఫీసర్ చినబాబు, జూనియర్ ఇంజినీర్‌లు పాల్గొన్నారు.

నూతన పద్ధతుల్లో బోధన చేయాలి

పుల్లలచెరువు: విద్యా వ్యవస్థలో ప్రభుత్వ తీసుకొస్తున్న నూతన పద్ధతుల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈవో శామ్యూల్ జాన్, ఇందిర ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిన కేజీబీవీలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులకు బైజూస్, ఐఎఫ్‌పీ ప్యానల్‌పై ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓలు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకొస్తు నూతన పద్ధతులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని విద్యార్థులకు బోధన చేయాలన్నారు. అనంతరం ఆర్‌పీలు బైజూస్, ఐఎఫ్‌పీలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ట్యాబ్‌లు, ప్యానల్ ఎలా ఉపయోగించాలి, విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా సులభ రీతిలో ఎలా బోధన చేయాలో ఆర్‌పీ వెంకటేశ్వర నాయక్ వివరించారు.

నిష్పక్షపాతంగా ఓటరు సర్వే

దర్శి: నిష్పక్ష పాతంగా ఓటరు సర్వేలు జరిపించామని, ఈఆర్‌ఓ ఎంవీఎస్ లోకేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరీరివిజన్–2024లో భాగంగా హౌస్‌టూహౌస్ సర్వేపై సమావేశం మంగళవారం జరిగింది. రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ జ్వాలానరసింహం, నగరపంచాయతీ కమిషనర్ మహేశ్వరరావు, దర్శి ఉపతహసీల్దార్ రవిశంకర్, ఏఎస్‌ఓ ఇ. ప్రసాద్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ యం. రామారావు, నాయకులు వెన్నపూస వెంకటరెడ్డి, వెంకటరవి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, హనుమంతరావు, కరుణానిధి, పాపారావు పాల్గొన్నారు.

ఎంపీపీకి సత్కారం



ఎంపీపీని సన్మానిస్తున్న ఎంపీడీఓ

ఒంగోలు టౌన్: ఎంపీపీగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న పల్లపోలు మల్లికార్జు రెడ్డిని ఒంగోలు ఎంపీడీఓ పీఎస్ అజిత మంగళవారం తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. బొకే ఇచ్చి శాలువా కప్పి సత్కరించారు. సమర్థవంతంగా రెండేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారని చెప్పారు. పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.